
తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) ఉగాది మినీ కథల పోటీలో రు. 150 గెలుపొందిన రచన

# అపరిచిత అతిథి

పాటిబండ్ల రజని




బ్రతుకు భారం మోయలేని మధ్యతరగతి కుటుంబీకుడిలా ఈసురోమంటూ వచ్చి డిపోలో ఆగింది బస్.

సమయం రాత్రి పదకొండు దాటింది. మధ్యలో ఆగిపోయిన బస్సునీ, రోడ్డు రవాణా సంస్థనీ తిట్టుకుంటూ నిద్రకళ్ళతో దిగిపోతున్నారు ప్రయాణికులు.

వారందరితోపాటు భయం భయంగా దిక్కులు చూస్తూ దిగిందో అందమైన యువతి. ఇటువంటి పరిస్థితిని ఊహించనందువల్లనో ఏమో తెల్లగా పాలిపోయి వడిలిపోతున్న తెల్ల కలువలా వుందామె మొహం. స్వల్పంగా కంపిస్తున్నాయామె పెదవులు.

''చూడండి మిస్. ఇప్పుడు ఒంటరిగా వెళ్ళడం మీకు కష్టమైతే తెల్లవారేవరకూ అదుగో ఆ వెయిటింగ్ రూమ్‌లో కూర్చోండి'' ముక్తసరిగా చెప్పి తన బాధ్యత తీరిపోయినట్లు వెళ్ళిపోయాడు కండక్టర్. తప్పు చేసిన వ్యక్తిని ద్వీప కల్పంలో ఒంటరిగా వదలి వెళ్ళిపోతున్నట్లు వెళ్ళిపోతున్న ఇతర ప్రయాణీకుల వంక చూసి నిట్టూరుస్తూ తన ఎయిర్ బ్యాగ్‌ను, బుట్టను తీసుకుని వెయిటింగ్ రూమ్ వైపు నడిచిందా యువతి. రొమ్ములొమ్ముగా బిచ్చగాళ్ళతోనూ, ప్రయాణీకులతోనూ, మూటలతోనూ నిండి అసహ్యంగా వుందా వెయిటింగ్ రూమ్. కాలు పెట్టడానికి కూడా ఖాళీ లేకుండా వున్న ఆ గదిలో ఎలా గడపాలో అర్థంగాక మూసి వున్న ఒక స్టాల్ ముందు వున్న బెంచిపై జారగిలబడి నిస్త్రాణగా కళ్ళు మూసుకుంది ఆ యువతి. మధ్యాహ్నం ఎప్పుడో హడావిడిగా చేసిన భోజనం. అంతే మరేమీ తీసుకోపోవటం వల్ల విపరీతమైన ఆకలిగా వుందామెకు. ఎయిర్ బ్యాగ్ లోనుంచి బిస్కెట్ ప్యాకెట్ తీస్తూ ఎవరో తననే చూస్తున్నట్లుగా అనిపించి

## రచయిత్రి స్వపరిచయం

పుట్టిన 21 సంవత్సరాల తరువాత పుత్రికోత్సాహాన్ని పొందిన తల్లిదండ్రులు ఝాన్సీలక్ష్మి, సీతాపతి రావులు. స్థానిక సర్వోదయ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయిని. పుస్తకాలు చదవడం, కవితలు రాయడం హాబీలు. ప్రాణ స్నేహితురాలు 'లక్ష్మి' అనుభవానికి నా ఊహ కలిస్తే తయారైన నా మొదటి కథ ఇది. జన్మ నివ్వడమే కాక యుక్తాయుక్తాలు తెలిపి, వ్యక్తిని చేసిన నా తల్లిదండ్రుల రుణం ఎలా తీర్చుకోలేనో రచయిత్రిగా నాకు జన్మనిచ్చిన 'ఆంధ్రజ్యోతి' రుణం కూడా అంతగా తీర్చుకోలేనిది. 'రజని కథ రాసిందా' అని ఆశ్చర్యపోయే వాళ్ళందరికీ నా ఈ మొదటి కథ అంకితం.

—పాటిబండ్ల రజని, తిరువూరు.



ప్రక్కలకు చూసిందామె.

వెకిలిగా నవ్వారు అక్కడే నిలబడి వున్న ఇద్దరు యువకులు. గుండె దడ దడ లాడిందామెకు. ఒళ్ళంతా చెమట పట్టసాగింది ఆ డిసెంబర్‌లో కూడా. మెడలోని గొలుసు కన్పించకుండా చెంగు మెడ చుట్టూ కప్పుకుంటూ బిగుసుకుని కూర్చుంది. ఆ బెంచి ప్రక్క నుంచి ఈల వేసుకుంటూ రెండుసార్లు అటూ ఇటూ తిరిగారు. ఇంకోసారి వాళ్ళు తన దగ్గరకు వస్తే భయంతో స్పృహ తప్పేట్లుందామెకు.

ఇంతలో చేతిలోని లాఠీ ఊపుకుంటూ అటుగా వస్తున్న కానిస్టేబుల్‌ని చూసి వింతగా మెరిసాయి ఆ యువతి కళ్ళు. ఏమీ తెలియని అమాయకుల్లా ఆ కానిస్టేబుల్‌కు ఎదురువెళ్ళారు ఆ కుర్రాళ్ళిద్దరూ "హలో కానిస్టేబుల్ సాబ్" అంటూ. ఆ కానిస్టేబుల్ కూడా నవ్వుతూ మాట్లాడి వాళ్ళ దగ్గర్నుంచి ఓ సిగిరెట్ తీసుకుని 'అచ్ఛా' వస్తా అంటూ వెళ్ళిపోతున్నాడు.

ఆ యువకులిద్దరూ ఆమె వైపు తిరిగి విలాసంగా కళ్ళెగరేస్తూ నవ్వారు.

ఆ యువతి అవేమీ పట్టించుకోకుండా తన సామాను చేతిలోకి తీసుకుంటూ 'కానిస్టేబుల్' అంటూ పిలిచింది దర్పంగా. వెనక్కు తిరిగి 'క్యా' అంటూ విసుగ్గా దగ్గరకు వచ్చాడు.

"నిన్ను బావగారు పంపలేదా?" అందామె గంభీరంగా.

"ఎవరు మీ బావగారు?" వెటకారంగా అడిగాడు అతను. ఫక్కున నవ్వారు ఆ రోమియోలు.

"డి.ఎస్.పి. వాల్మీకి గారు" అందామె.

అంతే అటెన్షన్‌లోకి వచ్చేసాడు ఆ కానిస్టేబుల్. "లేదమ్మా!" అన్నాడు తన ఇందాకటి ప్రవర్తన గుర్తు తెచ్చుకుని భయపడుతూ.

"సరేలే. కరుణాదేవిగారు అంటే వాల్మీకి గారి భార్య నాకు కజిన్. నేను ఈ వేళ వస్తానని లెటర్ రాశాను. బస్సు ఆలస్యంగా రావటం వల్ల వాళ్ళు పంపిన వాళ్ళు ఎవరూ కన్పించలేదు" అంది సాలోచనగా. "ప్చ్! అడ్రస్, ఇంటినెంబర్ కూడా తెలీదు' స్వగతంగా అన్నట్లుగా అంది.

"పోనీలెండమ్మా. నేను పంపిస్తాను పదండి" అని 'దొంగ నాయాళ్ళారా ఆడపిల్ల కనపడితే అట్టా పళ్ళికిలించి చూడటమే. కాళ్ళిరగ్గొట్టి బొక్కలోకి తోసేస్తాను' అని కసిరాడు ఇందాకటి యువకుల్ని. తెల్లబోయి చూస్తూ వెళ్ళిపోయారు వాళ్ళు.

తనే స్వయంగా ఆటోలో తీసుకువెళ్ళి డి.ఎస్.పి. గారి ఇంటిముందు దింపి వెళ్ళిపోయాడు అతను. నెమ్మదిగా వెళ్ళి కాలింగ్‌బెల్ మోగించిందామె. వంట మనిషి కాబోలు వచ్చి తలుపు తీసింది. ప్రశ్నార్థకంగా చూసిందామె వైపు.

"నేను కరుణాదేవిగారి కోసం వచ్చాను" సమాధానం చెప్పిందా యువతి.

"అలాగా, లోపలకి రండమ్మా. అమ్మగారు, అయ్యగారూ ఇవాళ సాయంత్రమే విశాఖపట్నం వెళ్ళారు" అందామె.

"అరే. నేను రేపు పొద్దునే వెళ్ళిపోవాలే..సరే... నన్ను తెల్లవారుఝామున లేపు" అని చెప్పి గెస్ట్ రూమ్‌లోకి వెళ్ళి పడుకుందా యువతి. తెల్లవారు ఝామునే లేచి కరుణాదేవిగారి కిమ్మని వంట మనిషి చేతికి ఓ కవర్ ఇచ్చి వెళ్ళిపోయింది. ఆ సాయంత్రం ఆ కవర్ తెరిచి చూసిన కరుణాదేవి గారికి అందులో వున్న ఉత్తరంలో కొన్ని వాక్యాలు కన్పించాయి.

గౌ. కరుణాదేవిగారికి నమస్కారములు.

ఎవరా ఈ అపరిచిత అతిథి అని ఆశ్చర్య పోతున్నారు కదూ. నేను మీకు అపరిచితురాలినే. కాలేజి నుండి స్వంత ఊరికి వెళుతూ బస్ వెడిపోవటం వల్ల బస్టాండ్‌లో చిక్కుబడి పోయాను. అవకాశం కోసం చూస్తున్న ఇద్దరు రోమియోలనూ, వారిని చూసీ చూడనట్లు పోతున్న కానిస్టేబుల్‌ను చూడగానే ఆగిపోయిన మా బస్ ప్రక్క నుండి వైజాగ్ వైపు వెళుతున్న మీరు కనిపించిన సంగతి గుర్తు వచ్చింది. ఫలితం–నేను మీ కజిన్‌గా అబద్ధం ఆడి మీ ఇంట్లో ఒక్క రాత్రికి ఆశ్రయం పొందాను. ఇలా చేయటం వలన మీ వారి కేసుల లిస్టు నుండి ఒక రేప్ కేసునూ, ఒక డెకాయిట్ కేసునూ తప్పించాననుకుంటున్నాను. నా దుస్సాహసాన్ని మీరు అర్థం చేసుకుని క్షమిస్తారని ఆశిస్తూ–

మీ అపరిచిత అతిథి
సమీర

ఆ ఉత్తరం చదివిన కరుణాదేవి పెదవులపై చిరునవ్వు నాట్యం చేసింది. వెంటనే లెటర్ హెడ్ అందుకొని సమీర రాసిన అడ్రస్‌కు లెటర్ వ్రాసింది. అందులో ఒకే వాక్యం వుంది. అది–

వెల్‌డన్ సమీరా వెల్‌డన్

– విత్ బెస్ట్ కాంప్లిమెంట్స్
కరుణా వాల్మీకి

శేషేంద్ర సీరియల్ కామోత్సవ్ త్వరలో ప్రారంభం